క్లుప్తంగా

నేడు ఉచిత వైద్యశిబిరం

నల్లగొండ రూరల్: అన్నెపర్తి 12వ బెటాలియన్‌లో గురువారం హైదరాబాద్‌కు చెందిన ఒక ప్రైవేటు ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు బెటాలియన్ కమాండెంట్ ఎస్‌వి.సత్య శ్రీనివాసరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. బెటాలియన్ సమీప గ్రామ ప్రజలు, బెటాలియన్ సిబ్బంది ఉదయం 10.30 నిర్వహించే వైద్యశిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ శిబిరంలో సాధారణ వైద్యులు, గైనకాలజిస్టు, శిశు వైద్యులు, ఆర్థోపెడిక్ వైద్యులు పాల్గొంటారని తెలిపారు.

సీఎం ఫ్లెక్సీకి పాలాభిషేకం



పాలభిషేకం చేస్తున్న వైద్య సిబ్బంది

నకిరేకల్ : తెలంగాణ వైద్య విధాన పరిషత్ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి చొరవ చూపిన సీఎం రేవంత్‌రెడ్డి, వైద్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహలకు కృతజ్ఞతలు తెలుపుతూ వారి చిత్రపటాలకు నకిరేకల్ ఏరియా ఆస్పత్రిలో ఉద్యోగులు పాలభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో ఇట్టిమల్ల అమృతారావు, సూపరింటెండెంట్ జి.శోభారాణి, డాక్టర్ అరుణ, సిబ్బంది సునిత, సువర్ణ, కవిత, ప్రసన్న, కుమారి, రామచంద్రు, వరప్రసాద్, బాబురావ్, శ్రీహరి పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

కనగల్ : మండల కేంద్రంలోని 132 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా గురువారం ఉదయం 8:30 నిమిషాల నుంచి మధ్యాహ్నం 12:30 వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ట్రాన్స్‌కో ఏఈ రాజశేఖరాచారి ఒక ప్రకటనలో తెలిపారు. కనగల్, తుర్కపల్లి, తిమ్మన్నగూడెం, తొరగల్, యడవల్లి, పగిడిమర్రి, పొనుగోడు, దర్వేశిపురం ఉప కేంద్రం పరిధిలో ఉన్న గ్రామాల్లో 3 ఫేజ్ విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని పేర్కొన్నారు.

బడి బాట ర్యాలీ



ర్యాలీలో పాల్గొన్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

నకిరేకల్ : ప్రొఫెసర్ జయశంకర్ బడి బాట కార్యక్రమంలో భాగంగా నకిరేకల్ మున్సిపాలిటీలోని బాబస్‌సాహెబ్ గూడెంలో స్థానిక ప్రాథమిక పాఠశాల ఆధ్వర్యంలో బుధవారం ర్యాలీ నిర్వహించారు. గ్రామంలోని వీధుల్లో విద్యార్థులు ర్యాలీ నిర్వహించి ప్రభుత్వ పాఠశాలల్లో చిన్నారులను చేర్పించాలని నినాదాలు చేశారు. హెచ్‌ఎం శ్రీవాణి, ఉపాధ్యాయురాలు పారిజాత, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ సీత లాస్య, మాజీ వార్డు మెంబర్ వంటెపాక సరోజ, కమిటీ సభ్యుడు ముజీబ్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఫర్టిలైజర్ దుకాణాల తనిఖీ



రికార్డులు తనిఖీ చేస్తున్న అధికారులు

కేతేపల్లి: ఫర్టిలైజర్ దుకాణాల యజమానులు రైతులకు నాణ్యమైన ఎరువులు, విత్తనాలను మాత్రమే విక్రయించాలని కేతేపల్లి మండల ప్రత్యేక అధికారి నాగేశ్వరావు అన్నారు. కేతేపల్లిలోని ఎరువులు, విత్తనాల దుకాణాలను బుధవారం ఆయన తనిఖీ చేశారు. దుకాణాల్లో నిల్వ ఉన్న ఎరువులు, విత్తనాలకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎరువులు, విత్తనాలను ప్రభుత్వం నిర్ణయించిన ఎమ్మార్పీ ధరకే విక్రయించాలని ఆదేశించారు. నకిలీ విత్తనాలు అమ్మినట్లు తమ దృష్టికి వచ్చినట్లయితే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. విత్తనాలు కొనుగోలు చేసిన రైతులకు కచ్చితంగా రశీదు ఇవ్వాలన్నారు. ఆయన వెంట ఎంపీడీఓ బి.శ్రీనివాసరావు, ఏఓ బి.పురుషోత్తం ఉన్నారు.

విద్యుత్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

నల్లగొండ: విద్యుత్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని, లేకుంటే సమ్మె చేయడానికైనా వెనుకాడబోమని 1104 యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు వి.వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి సాయిబాబా అన్నారు. బుధవారం 1104 యూనియన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు. విద్యుత్ ఉద్యోగులు వినియోగదారులకు మెరుగైన సేవలు అందించేందుకు వారి ప్రాణాలను సైతం లెక్కచేయకుండా పనిచేస్తున్నారని అన్నారు. విద్యుత్ ఉద్యోగులకు వెంటనే పదోన్నతులు కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. అనంతరం సంఘం జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా 327 యూనియన్ నుంచి సీహెచ్.శివప్రసాద్, వెంకటేశ్వర్లు 1104 యూనియన్‌లో చేరారు. కార్యక్రమంలో ఎ.వేణు, ఎస్.వెంకన్న, ఆర్. జనార్దన్ రెడ్డి, విద్యుత్ కార్మికులు పాల్గొన్నారు.

శిథిలావస్థలో పంచాయతీ కార్యాలయం

- నలభై ఏళ్ల క్రితం నిర్మాణం
- తరచూ ఊడి పడుతున్న పైకప్పు పెచ్చులు
- భయంగా విధులు నిర్వహిస్తున్న సిబ్బంది
- నూతన భవనం నిర్మించాలని కోరుతున్న ప్రజలు



శిథిలావస్థకు చేరిన గుడివాడ పంచాయతీ కార్యాలయం



పెచ్చులూడిన పంచాయతీ భవనం పైకప్పు

కేతేపల్లి: మండలంలోని గుడివాడ గ్రామ పంచాయతీ భవనం శిథిలావస్థకు చేరుకుంది. తరచూ పెచ్చులూడుతూ ఎప్పుడు కూలుతుందోననే భయంతో పంచాయతీ సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు. గుడివాడ గ్రామంలో సుమారు 1200 కుటుంబాలు, 3500 పైగానే జనాభా ఉన్నారు. గ్రామపంచాయతీ భవనాన్ని నలభై ఏళ్ల క్రితం నిర్మించారు.

తేలిన ఇనుప చువ్వలు

గుడివాడ గ్రామపంచాయతీ కార్యాలయ భవనంలోని మూడు గదుల పైకప్పు నెర్రెలు పట్టి, ఇనుప చువ్వలు బయటకు తేలాయి. ఇటీవల కురిసిన వర్షాలకు నెర్రెల ద్వారా నీరు కారుతుండడంతో భవనం పైకప్పు పెచ్చులు ఊడి కింద పడుతున్నాయి. భవనానికి ఏళ్ల తరబడి మరమ్మతులు లేకపోవంతో పూర్తిగా శిథిలావస్థకు చేరుకుంది. ఎప్పుడు, ఏమూలన పెచ్చులూడుతాయో తెలియని పరిస్థితి నెలకొంది. భవనం ఎక్కడ కూలుతుందోననే భయంతో పంచాయతీ సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు. దీంతో కార్యాలయంలోకి వెళ్లే ముందు సిబ్బంది పైకప్పు చూసి లోపలికి వెళ్లాల్సి వస్తోంది. వర్షాలు వచ్చిన సమయంలో కార్యాలయంలోని ఫైళ్లు, సామగ్రి తడుస్తున్నాయని సిబ్బంది వాపోతున్నారు. ఎలాంటి ప్రమాదం జరగకముందే ఉన్నతాధికారులు చొరవ చూపి గుడివాడలో నూతన పంచాయతీ భవనాన్ని నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.

నూతన భవనాన్ని నిర్మించాలి



గుడివాడ గ్రామపంచాయతీ భవనం శిథిలావస్థకు చేరుకుంది. తరుచూ పెచ్చులూడుతుండడంతో పంచాయతీ పాలకవర్గ సమావేశాలను ఆరు బయట నిర్వహిస్తున్నారు. విధులు నిర్వహించేందుకు సిబ్బంది భయపడుతున్నారు. జిల్లా పంచాయతీ అధికారులు స్పందించి నూతన భవనాన్ని నిర్మించాలి.

–ఎ.జగన్నాథం, గుడివాడ

ప్రతిపాదనలు పంపించాం



గుడివాడ గ్రామ పంచాయతీ కార్యాలయ భవనం శిథిలావస్థకు చేరిన విషయం వాస్తవమే. నూతన భవనం నిర్మాణం కోసం ప్రభుత్వానికి గతంలోనే అధికారులు ప్రతిపాదనలు పంపించారు. నిధులు మంజూరు కాగానే నూతన గ్రామ పంచాయతీ భవనం నిర్మాణ పనులు ప్రారంభిస్తాం.

–శ్రీనివాస్, ఏఈ, పీఆర్, కేతేపల్లి

షరతులు లేకుండా రుణమాఫీ చేయాలి

- నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి

నకిరేకల్ : కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు ఇచ్చిన హామీ ప్రకారం ఎలాంటి షరతులు లేకుండా ప్రతి రైతుకు రూ.2లక్షల రుణమాఫీ చేయాలని నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య డిమాండ్ చేశారు. నకిరేకల్‌లోని బీఆర్‌ఎస్ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వానాకాలం సీజన్‌కు సంబంధించి ఎరువులు, మార్కెట్‌లో కల్తీ లేని విత్తనాలపై సంబంధిత శాఖ మంత్రులు సమీక్షలు కూడా చేయడం లేదన్నారు. గత ప్రభుత్వ హయాంలో కరెంటు కుంభకోణం జరిగిందని ప్రజలను పక్కదారి పట్టిస్తున్నారని ఆరోపించారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం రైతుబంధు కింద రూ.7500 కోట్లు విడుదల చేసిందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి రైతులకు ఉత్త ముచ్చట్లు చెబుతున్నారు తప్ప చేసింది ఏమీ లేదన్నారు. ఆసరా పింఛన్ పెంచుతామన్న హామీ కూడా నీటి మూటల్లాగానే మిగిలిపోయిందన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు ఇచ్చి హామీలన్నీ నెరవేర్చకపోతే బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ సమావేశంలో మున్సిపల్ చైర్మన్ రాచకొండ శ్రీనివాస్‌గౌడ్, నకిరేకల్, కేతేపల్లి మండలాల పార్టీ అధ్యక్షులు ప్రగడపు నవీన్‌రావు, మారం వెంకట్‌రెడ్డి, నాయకులు రాచకొండ వెంకన్నగౌడ్, నడికుడి వెంకటేశ్వర్లు, రాచకొండ సునీల్‌గౌడ్, దైద పరమేషం, చొగోని శంకర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణిపై అవగాహన కల్పించాలి

కేతేపల్లి: ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమంపై ప్రజలకు అవగాహన కల్పించాలని సివిల్ సప్లయ్ జిల్లా మేనేజర్, మండల ప్రత్యేక అధికారి నాగేశ్వరావు అధికారులను ఆదేశించారు. ప్రజావాణి కార్యక్రమం విజయవంతంపై బుధవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మండలస్థాయి అధికారులు, సిబ్బందితో నిర్వహించిన సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతి సోమవారం ఎంపీడీఓ కార్యాలయంలో ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు నిర్వహించే ప్రజావాణి కార్యక్రమానికి అన్ని ప్రభుత్వ శాఖల మండల స్థాయి అధికారులు తప్పనిసరిగా హాజరు కావాలన్నారు. స్వీకరించిన దరఖాస్తును 15 రోజుల్లో పరిష్కరించాలన్నారు. తహసీల్దారు మధుసూదన్‌రెడ్డి, ఎంపీడీఓ బి.శ్రీనివాసరావు, ఎంపీఓ నాగలక్ష్మి, ట్రాన్స్‌కో ఏఈ గాబ్రియేల్, ఏపీఓ సురేందర్, కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

పీఏసీఎస్ రికార్డుల పరిశీలన



సిబ్బందితో మాట్లాడుతున్న మేనేజర్ భరత్‌కుమార్

మర్రిగూడ : పీఏసీఎస్ లావాదేవీలు సక్రమంగా ఉండాలని చండూరు కోఆపరేట్ బ్యాంక్ మేనేజర్ భరత్‌కుమార్ అన్నారు. బుధవారం మర్రిగూడ సహకార సంఘానికి సంబంధించిన లావాదేవీలు, పలు రికార్డులను ఆయన తనిఖీ చేశారు. రైతులకు ఎరువులు, విత్తనాలు అందుబాటులో ఉండేవిధంగా చొరవ చూపాలని సిబ్బందికి సూచించారు. అనంతరం తమకు వేతనాలు అందించాలని కోరుతూ సిబ్బంది మల్లికార్జున్ మేనేజర్‌కు వినతిపత్రం అందజేశారు. ఆయన వెంట సీఈఓ శ్రీనివాస్, సాయి ఉన్నారు.

బైపాస్ బాధితులకు అండగా ఉంటా



బాధితులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి

- నల్లగొండ మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి

నల్లగొండ టూటౌన్ : బైపాస్ రోడ్డు నిర్మాణంలో జరిగే అక్రమాలను వెలుగులోకి తెచ్చి బైపాస్ భూబాధితులకు అండగా ఉంటానని మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి అన్నారు. నల్లగొండ పట్టణంలో కొత్తగా బైపాస్ రోడ్డు వేయనుండడంతో బుధవారం పలువురు భూపాల్‌రెడ్డిని కలిసి తమకు న్యాయం చేయాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాపాలన ముసుగులో మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తన ఇద్దరు అనుచరుల కోసం మూడువేల మంది పొట్ట కొడుతున్నాడని ఆరోపించారు. బాధితుల కష్టలను కోమటిరెడ్డి పట్టించుకోకుండా దుర్మార్గంగా వ్యవహరిస్తున్నాడని అన్నారు. బాధితులందరికీ న్యాయం జరిగే వరకు అండగా ఉంటానని, త్వరలోనే పాదయాత్ర చేసి ప్రతి వ్యక్తిని కదిలించి బైపాస్ అక్రమాలను బయటకు తెస్తామన్నారు. బైపాస్ రోడ్డు ఏర్పాటులో ఆప్షన్ 3 పేరుతో సామాన్యుల భూములను లాక్కొని వారి భూములకు డిమాండ్ పెంచుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకుడు దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.

రేపు అంతర్జాతీయ యోగా దినోత్సవం

నల్లగొండ: జిల్లా కేంద్రంలోని ఆర్య సమాజ మందిర ప్రాంగణంలో ఈ నెల 21న యోగా దినోత్సవం సందర్భంగా యోగా ప్రదర్శన నిర్వహించనున్నట్లు బోయపల్లి కృష్ణారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి కలెక్టర్ నారాయణరెడ్డి ముఖ్య అతిథిగా హాజరవుతారని పేర్కొన్నారు. ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు.

కలెక్టర్ నారాయణరెడ్డికి శుభాకాంక్షలు



నల్లగొండ: కలెక్టర్‌ను సన్మానిస్తున్న మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, గుమ్మల మోహన్‌రెడ్డి

నల్లగొండ టూటౌన్ : నూతన కలెక్టర్ నారాయణరెడ్డిని బుధవారం డ్యాబ్ ప్రతినిధులు శాలువాతో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో డ్యాబ్ ప్రధాన కార్యదర్శి, ఏబీసీబీ ఉపాధ్యక్షుడు పొనుగోటి చొక్కారావు, పెండ్యాల దామోదర్‌రావు పాల్గొన్నారు.

బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో..

నల్లగొండ టౌన్ : కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన సి.నారాయణరెడ్డిని బుధవారం బీసీ సంక్షేమ సంఘం నాయకులు కలిసి శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. మిర్యాల యాదగిరి, దుడుకు లక్ష్మీనారాయణ, గుండు వెంకటేశ్వర్లు, మునాస ప్రసన్న, సింగం లక్ష్మీ, మామిడి పద్మ, శంకర్, దుర్గ, గంజి భిక్షమయ్య, పున్న వీరేశం, గడ్డం దశరథ, చెరుపల్లి సదాశివ, వల్లకీర్తి శ్రీనివాసులు, మిర్యాల వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

కలెక్టర్‌ను సన్మానించిన కాంగ్రెస్ నాయకులు

నల్లగొండ: నూతన కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన సి.నారాయణరెడ్డిని బుధవారం మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నల్లగొండ పట్టణ అధ్యక్షుడు గుమ్మల మోహన్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి శాలువా కప్పి సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నల్లగొండ మార్కెట్ కమిటీ చైర్మన్ జూకూరి రమేష్, కేసాని వేణుగోపాల్‌రెడ్డి, ఇబ్రహీం, సమద్, మారగోని నవీన్‌గౌడ్, బాబా, శ్రీనివాస్, జూలకంటి సైదిరెడ్డి, మందడి శ్రీనివాస్‌రెడ్డి, పున్న పవన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పీఆర్‌టీయూ టీఎస్ ఆధ్వర్యంలో..

నూతన కలెక్టర్ నారాయణరెడ్డిని బుధవారం పీఆర్‌టీయూ టీఎస్ జిల్లా అధ్యక్షుడు డీవీఎస్.ఫణికుమార్ ఆధ్వర్యంలో యూనియన్ నాయకులు కలిసి సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం సంఘం నాయకులు కలెక్టర్‌కు పీఆర్‌టీయుటీఎస్ డైరీని అందజేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు కాలం నారాయణరెడ్డి, తరాల పరమేష్, గాదె వెంకట్‌రెడ్డి, తీగల శంకరయ్యలు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు

నకిరేకల్ : నిన్నటి త్యాగాలకు వారసుడు.. రేపటి తరానికి మార్గదర్శకుడు రాహుల్ గాంధీ అని నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. నకిరేకల్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బుధవారం రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆయన కేక్ కట్‌చేసి మాట్లాడారు. కార్యక్రమంలో పన్నాల రాఘవరెడ్డి, కందాల భిక్షంరెడ్డి, లింగాల వెంకన్న, గాదగోని కొండయ్య, గండమల్ల లక్ష్మీనారాయణ, చెవుగోని శ్రీను తదితరులు పాల్గొన్నారు.

నల్లగొండ: కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలను బుధవారం నల్లగొండలోని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి క్యాంపు కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు గుమ్మల మోహన్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాసరెడ్డి కేక్ కట్ చేశారు. మున్సిపల్ వైస్ చైర్మన్ అబ్బగోని రమేష్ గౌడ్, నల్లగొండ మార్కెట్ కమిటీ చైర్మన్ జూకూరి రమేష్, కౌన్సిలర్లు బొజ్జ శంకర్, సమద్, కేసాని వేణుగోపాల్‌రెడ్డి, జూలకంటి శ్రీనివాస్, మారగోని నవీన్‌గౌడ్, నన్నూరి విష్ణువర్ధన్‌రెడ్డి, మందడి శ్రీనివాస్‌రెడ్డి, కత్తుల కోటి, జూలకంటి సైదిరెడ్డి, గాలి నాగరాజు, మామిడి కార్తీక్, కిన్నెర అంజి, గోలి రవి, పాదం అనిల్, జహంగీర్ బాబా, చింతా గోపాల్ పాల్గొన్నారు.

చిట్యాల: కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్‌గాంధీ జన్మదిన వేడుకలను చిట్యాలలో బుధవారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా బర్త్ డే కేక్‌ను మున్సిపల్ చైర్మన్ కోమటిరెడ్డి చిన వెంకట్‌రెడ్డి, డీసీసీ కార్యదర్శి పోకల దేవదాసు కట్ చేశారు. కార్యక్రమంలో ఏనుగు అంజిరెడ్డి, ఎద్దులపురి కృష్ణ, మేడిశెట్టి ఉమాశంకర్, రెముడాల మధు, ఏర్పుల పరమేష్, బొబ్బల రాంరెడ్డి, పోకల అశోక్, దేశపాక రాజేష్, జిట్ట భిక్షం, యేసు పాల్గొన్నారు.

మర్రిగూడ : కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్‌గాంధీ జన్మదిన వేడుకలను మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రాందాస్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించారు. మాజీ జెడ్పీటీసీ మేతరి యాదయ్య, రాపోలు యాదగిరి, జంగిలి రవి, ఏర్పుల శ్రీశైలం, కుంభం శ్రీనివాస్‌రెడ్డి, జంగయ్య, లూర్థయ్య, లింగారెడ్డి, ప్రశాంత్, మల్లయ్య, రంగారెడ్డి, రాములుగౌడ్, కిరణ్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



నకిరేకల్ : కేక్ కట్‌చేస్తున్న ఎమ్మెల్యే వేముల వీరేశం



నల్లగొండ: కేక్ కట్ చేస్తున్న మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, గుమ్మల మోహన్‌రెడ్డి



చిట్యాల : కేక్ కట్ చేస్తున్న నాయకులు



మర్రిగూడ మండల కేంద్రంలో..

బైపాస్ బాధితులను పట్టించుకోని మంత్రి

- బీజేపీ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డి



మంత్రి కోమటిరెడ్డి నల్లగొండకు చేసిన అభివృద్ధి ఏమీ లేదని కోడిగుడ్డు చూపిస్తున్న వర్షిత్‌రెడ్డి

నల్లగొండ టూటౌన్ : నల్లగొండ పట్టణంలో బైపాస్ రోడ్డు నిర్మాణంలో మూడువేల మంది బాధితులు రోడ్డున పడుతుంటే మంత్రి ఎందుకు పట్టించుకోవడంలేదని బీజేపీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ నాగం వర్షిత్‌రెడ్డి ప్రశ్నించారు. బుధవారం స్థానిక బీజేపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆప్షన్ 1, ఆప్షన్ 2 వదిలేసి ఆప్షన్ 3 తీసుకోవడం వెనుక ఉన్న మతలబు ఏంటన్నారు. మంత్రిగా కోమటిరెడ్డి నల్లగొండకు చేసిన అభివృద్ధి కోడిగుడ్డు అని ఎద్దేవా చేశారు. బైపాస్ రోడ్డు కోసం ఆప్షన్ 3 అమలు చేయడం వల్ల మూడు వేల కుటుంబాలు రోడ్డున పడుతున్నాయని, దీనిని వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ప్రజలకు తక్కువ నష్టం జరిగే ఆప్షన్ 2 అమలు చేయాలన్నారు. బీటెక్ ఫెయిల్ అయిన మంత్రికి తెలియకపోతే ఇతరుల దగ్గర సలహా తీసుకోవాలన్నారు. భూ బాధితులకు ఇందిరమ్మ ఇల్లు కట్టిస్తామనడం సరికాదన్నారు. రియల్ ఎస్టేట్ వ్యాపారిగా మంత్రి వ్యవహరిస్తున్నాడని ఆగ్రహం వ్యక్తం చేశాడు. మూడు రోజుల్లోగా మూడో ఆప్షన్ వెనక్కు తీసుకోకపోతే మంత్రి ఇల్లు ముట్టడిస్తామని హెచ్చరించారు. అంతకు ముందు బైపాస్ రోడ్డు మ్యాప్‌ను బాధితులతో కలిసి పరిశీలించారు.

కొనసాగుతున్న ఆలయ బ్రహ్మోత్సవాలు

చౌటుప్పల్ : పట్టణ కేంద్రంలోని శ్రీసత్యదేవ సహిత శ్రీఅయ్యప్పస్వామి దేవాలయ వార్షిక బ్రహ్మోత్సవాలు బుధవారం కొనసాగాయి. శ్రీ సుబ్రహ్మణ్యేశ్వరస్వామి, శ్రీసత్యనారాయణస్వామిల కల్యాణ్ని వైభవంగా నిర్వహించారు. అనంతరం ఆలయానికి వెళ్లే దారిలో జాతీయ రహదారి వద్ద నిర్మించనున్న ముఖద్వారం (ఆర్చీ) పనులకు దాతలు బొడ్డు సంజీవరెడ్డి–నిర్మల, బొడ్డు శ్రీనివాస్‌రెడ్డి–రేవతి దంపతులు శంకుస్థాపన చేశారు.

నూతన రేషన్ షాపులు ప్రారంభించరూ..

- చండూరు డివిజన్ పరిధిలో 21 దుకాణాలకు డీలర్ల ఎంపిక
- నాలుగు మాసాలు కావొస్తున్నా ప్రారంభం కాని షాపులు
- ఇబ్బందులు పడుతున్నామంటున్న లబ్ధిదారులు



జక్కులవారిగూడెం నుంచి రేషన్ సరుకులు తెచ్చుకుంటున్న రావిగూడెం లబ్ధిదారులు (ఫైల్)

మునుగోడు: చండూరు రెవెన్యూ డివిజన్ పరిధిలో నూతన పంచాయతీలతో పాటు ఖాళీగా ఉన్న రేషన్ దుకాణాలను ప్రారంభించకపోవడంతో లబ్ధిదారులు ఇబ్బందులు పడుతున్నారు. నూతనంగా ఏర్పాటైన గ్రామ పంచాయతీలతో పాటు ఖాళీగా ఉన్న వివిధ చౌక ధరల దుకాణాల డీలర్లని నాలుగు నెలల క్రితం ఎంపిక చేశారు. చండూరు రెవెన్యూ డివిజన్ పరిధిలోని మునుగోడు, చండూరు, నాంపల్లి, మర్రిగూడ మండలాల్లో నూతనంగా మంజూరైన దుకాణాలతో పాటు ఖాళీగా ఉన్న మొత్తం 21 రేషన్ దుకాణాలకు అవసరమైన డీలర్ల కోసం గత జనవరిలో దరఖాస్తులు కోరారు. దీంతో ఒక్కో దుకాణానికి 5 నుంచి 10 మంది వరకు 305 మందికిపైగా దరఖాస్తు చేసుకున్నారు. వారందరికీ అప్పటి ఆర్‌డీఓ చండూరులో ఫిబ్రవరి 1న రాత పరీక్ష నిర్వహించారు. అదే నెల 22న ఫలితాలు విడుదల చేసి పరీక్షలో ఉత్తీర్ణులైయిన వారికి 25న ఇంటర్వ్యూలు నిర్వహించి అర్హులను ఎంపికచేశారు. కానీ నేటికీ ఆ దుకాణాలను ప్రారంభించలేదు. దీంతో ఆయా గ్రామాల ప్రజలు గతంలో వల్లే ఇబ్బందులు పడుతూ పాత గ్రామ పంచాయతీల్లోని దుకాణాల వద్దకు వెళ్లి సరుకులు తెచ్చుకుంటున్నారు. ఇప్పటికైనా సంబంధిత ఉన్నత అధికారులు ప్రత్యేక చొరవ తీసుకొని డీలర్లని ఎంపిక చేసిన దుకాణాలను వెంటనే ప్రారంభించాలని కోరుతున్నారు.

వాచ్‌మెన్ పోస్టుకు ఇంటర్వ్యూ

కట్టంగూర్ : మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ బాలికల పాఠశాలలో ఖాళీగా ఉన్న డే వాచ్‌మెన్ (మహిళ) పోస్టుకు బుధవారం త్రిసభ్య కమిటీ సభ్యులు తహసీల్దార్ గుగులోతు ప్రసాద్, ఎంపీడీఓ జ్ఞానప్రకాశ్‌రావు, ఎంఈఓ మేక నాగయ్య ఆధ్వర్యంలో ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటర్వ్యూకు హాజరైన అభ్యర్థుల సర్టిఫికెట్లను అధికారులు పరిశీలించారు. ఎంఈఓ మేక నాగయ్య మాట్లాడుతూ మహిళా వాచ్‌మెన్ పోస్టుకు 51 మంది దరఖాస్తు చేసుకోగా 38 మంది ఇంటర్వ్యూకు హాజరయ్యారని పేర్కొన్నారు. ఒకరిని నియమించేందుకు ప్రభుత్వ నిబంధనల ప్రకారం జిల్లా విద్యాశాఖాధికారికి నివేదిక పంపామని తెలిపారు. డీఈఓ ఉత్తర్వులు అందిన వెంటనే పోస్ట్ భర్తీ చేస్తామని ఎంఈఓ పేర్కొన్నారు.

వర్షంతో రైతులకు ఊరట

కేతేపల్లి: కొద్ది రోజులుగా మబ్బులతో ఊరించిన వరుణుడు కరుణించడంతో కేతేపల్లి మండలంలో వానాకాలం సాగుపై రైతుల ఆశలు చిగురించాయి. జూన్ మొదటి వారంలో కురిసిన వర్షాలకు రైతులు పత్తి విత్తనాలు విత్తారు. కానీ వర్షం వచ్చినట్లే వచ్చి ముఖం చాటేసింది. దీంతో భూమిలో వేసిన విత్తనాలు మొలకెత్తక రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. వర్షం రాకపోగా మండుతున్న ఎండలతో అక్కడక్కడ మొలిచిన మొక్కలు సైతం మాడిపోతున్నాయి. ఈనేపథ్యంలో మండలంలోని పలు గ్రామాల్లో మంగళవారం రాత్రి కురిసిన వర్షం పత్తి పంటలకు జీవం పోసినట్లయింది. దాదాపు పదిహేను రోజుల తర్వాత వర్షం పడడంతో బుధవారం రైతులు వ్యవసాయ పనుల్లో నిమగ్నమయ్యారు.మరికొందరు మొలకెత్తని విత్తనాల స్థానంలో మరోసారి విత్తనాలు వేస్తున్నారు.



కేతేపల్లిలో పత్తి విత్తనాలు విత్తుతున్న కూలీలు

రెడ్డి భవన్ నిర్మాణానికి స్థల దానం



రిజిస్ట్రేషన్ పత్రాలు అందజేస్తున్న బొబ్బలి శివశంకర్‌రెడ్డి–శ్వేత దంపతులు

చిట్యాల: మున్సిపాలిటీలో రెడ్డి భవన్ నిర్మాణానికి రెడ్డి సంక్షేమ సంఘం అధ్యక్షుడు బొబ్బలి శివశంకర్ రెడ్డి–శ్వేత దంపతులు స్థల దానం చేసేందుకు ముందుకు వచ్చారు. చిట్యాల మున్సిపాలిటీ పరిధిలోని 11వ వార్డులో ఎంఎస్ రెడ్డి కాలనీలో వారికి గల 202 చదరపు గజాల స్థలాన్ని బుధవారం నల్లగొండలోని రిజిస్ట్రేషన్ కార్యాలయంలో రెడ్డి సంక్షేమ సంఘం–చిట్యాల పేరున రిజిస్ట్రేషన్ చేసి ఆ పత్రాలను రెడ్డి సంక్షేమ సంఘం పెద్దలకు అందజేశారు. కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు బొబ్బలి పాండురెడ్డి, కోమటిరెడ్డి రాంరెడ్డి, పాటి మాధవరెడ్డి, వరకాంతం శ్రీనివాస్‌రెడ్డి, వరకాంతం నరేందర్‌రెడ్డి, జగిని భిక్షంరెడ్డి, కాకులారపు బొర్రా రెడ్డి, ఏనుగు సుధాకర్‌రెడ్డి, కోమటిరెడ్డి అమరేందర్ రెడ్డి, కంచాటి కృష్ణారెడ్డి, గంటా శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.